# సెంటిమెంటోదే గెలుపు
# కీర్తి కె.సి.ఆర్‌ది కాదు




తుర్లపాటి నాగభూషణం

ఉపఎన్నికల్లో ముమ్మాటికి తెలంగాణ సెంటిమెంటే గెలుస్తుంది. అలాగని తెలంగాణ రాష్ట్ర సమితి గెలుస్తుందని కాదు. ఎందుకంటే ఈ ఎన్నికల్లో అన్ని పార్టీలు తెలంగాణ సెంటిమెంట్‌నే నమ్ముకున్నాయి కాబట్టి. ఇంతకుముందు తెలంగాణ సెంటిమెంట్ అంతగా లెక్కచేయని పార్టీలు సైతం నేడు 'జై తెలంగాణ' అంటూ ప్రజల ముందుకు వెళుతున్నాయి. ఈ పరిణామంతో టీఆర్ఎస్ అయోమయంలో పడింది. ఇన్నాళ్ళూ...తెలంగాణ సెంటిమెంట్ తమ సొత్తుగా భావించిన టీఅర్ఎస్‌కు ఇకపై నూకలు చెల్లినట్లే, కాంగ్రెస్, టిడిపి, బిజెపి, సిపిఐ ఇటీవలే పురుడుపోసుకున్న లోక్‌సత్తా కూడా జై తెలంగాణ అంటూ వల్లమాలిన అభిమానాన్ని ప్రదర్శిస్తుండడమే అందుకు కారణం.

ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖ ర్‌రెడ్డికి రాష్ట్రాన్ని ముక్కలు చేయడం సుతారమూ ఇష్టంలేదు. అలాగని సెంటిమెంట్‌ను తీసి పారేయ లేని పరిస్థితి. పరిస్థితులను అవగతం చేసుకుని తప్పని పరిస్థితుల్లో సెంటిమెంట్ ఉందని ఆంగీకరించక తప్పలేదు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలిచి అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయాలని వైయస్ ఎంతగానో తపిస్తున్నాడు. వైయస్ విషయం కాసేపు పక్కన పెడితే ఆ పార్టీ నాయకులు మాత్రం బరిలోకి దిగేందుకు మల్లగుల్లాలు పడుతున్నారు. బయటకు చెప్పలేకపోయినా, వారు పోటీ చేయడానికి సిద్దంగా లేరు. అలాగని పోటీ చేయకుండా ఉండలేరు. ఈ సమయంలో గత నాలుగేళ్ళలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధినే తమ ఎజెండాగా ప్రజల్లోకి తీసుకెళ్ళడమే కాంగ్రెస్ ధ్యేయంగా ముందుకెళ్ళనుంది.



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మాత్రం మొదటి నుంచి సమైక్యాంధ్ర నినాదం విడలేదు. సెంటిమెంట్ ప్రబావం తెలుసుకుని తలొగ్గాడే కానీ, రాష్ట్రాన్ని వేరు చేయాలన్న ఆలోచన ఏ మాత్రం లేదు. టీడీపీకి చెందిన తెలంగాణ ప్రాంత నాయకులు తెలంగాణ వాదాన్ని అవకాశం వచ్చిన ప్రతిసారి వినిపించినప్పటికీ సమయస్ఫూర్తితో దాటవేయగలిగాడు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటాం. అప్పటి వరకు వేచి చూడండంటూ దాటవేత ధోరణి ఆవలంభించారు.కానీ పరిస్థితుల ప్రభావంతో తెలంగాణలో సెంటిమెంట్ ప్రభావం ఎంత మేరకు ఉందో తెలుసుకునేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన ఓ కమిటి వేశారు. తెలంగాణకు టిడిపి వ్యతిరేకం కాదు. కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రం ప్రకటిస్తే తాము అడ్డుకోబోమని చంద్రబాబు స్పష్టంచేశారు. ఎలాగైనా ఈ ఎన్నికల్లో పూర్వవైభవాన్ని తీసుకురావాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నారు. టీఆర్ఎస్ పార్టీ పుట్టకముందు ప్రస్తుతం జరుగుతున్న స్థానాల్లో టిడిపికి మంచి పట్టు ఉంది. ఈ ఎన్నికల్లో గరిష్ట స్థాయిలో సీట్లను గెలవాలన్నదే టిడిపి అభిమతంగా స్పష్టమవుతోంది. ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకం కాదనీ, ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూ ప్రజల ముందుకు వెళ్ళనుంది.

భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వలేకపోయినప్పటికీ ప్రస్తుతం మాత్రమే తమ వల్లనే సాధ్యమని గొప్పలకు పోతోంది. ప్రత్యేక తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ ఇవ్వడానికి సిద్దంగా లేకపోవడంతో వ్యూహాత్మకంగా తెలంగాణ పల్లవిని అందుకుంది. ప్రత్యేక తెలంగాణ జాతీయ పార్టీల వల్లే సాధ్యమవుతుందనీ, కేవలం ప్రాంతీయ పార్టీల వల్ల అది సాధ్యం కాదని తేల్చింది. సెంటిమెంట్ బలంగా ఉందనీ, బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని చెబుతోంది. టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాలని భావించినప్పటికీ ఆ పార్టీ సుముఖంగా లేకపోవడంతో ఒంటరిగానే పోటి చేయనుంది.

ఇటివలే పుట్టుకొచ్చిన లోక్‌సత్తా పార్టీ కూడా తెలంగాణ సెంటిమెంట్‌కు తలొగ్గి నాలుగు స్థానాల్లో పోటీచేయనుంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడాల్సిందే కానీ రాజధానీ మాత్రం వేరు కావల్సిన అవసరం లేదని వాదిస్తోంది. ప్రజలకు కావాల్సిన పాలనను అందిస్తాం.ఓటెయ్యండి అధికారం కట్టబెడతామన్న నినాదంతో ప్రజల వద్దకు వెళ్ళనుంది

సిపిఐ పార్టీకూడా తెలంగాణకు తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నారని, సెంటిమెంట్‌కు తలొగ్గాల్సిందేనని వాదిస్తోంది. అంతేకాకుండా ప్రత్యేక తెలంగాణ తమతో మాత్రమే సాధ్యమని చెబుతోంది.

సెంటిమెంటే ఆయుధంగా అవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి అదే తమ పెటెంట్ హక్కుగా భావించింది. ప్రస్తుతం అన్ని పార్టీలు సెంటిమెంట్ గౌరవిస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితిలో పడింది. టీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోతున్న ప్రతిసారీ ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తన వాక్చాతుర్యంతో జనం నోళ్ళలో నానేట్టు చేయడంలో సఫలీకృతమయ్యారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేక గాలులు వీచిన సమయాల్లోనూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కేసీఆర్‌కు జీవం పోశారు. గతంలోనూ సెంటిమెంట్ ఉందని రుజువుకావడంతో, ప్రస్తుతం ఏ ఒక్క పార్టీ కూడా బహిరంగంగా సెంటిమెంట్ లేదని చెప్పలేకపోతున్నది.

ఈ ఎన్నికల్లో మాత్రం ప్రధానమైన పోటీ కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్‌ల మధ్యే ఉంటుంది. ప్రజలు సెంటిమెంట్‌నే గౌరవిస్తారని ఇంతకుముందు కూడా నిరూపణయింది. అప్పడు కేవలం టీఆర్ఎస్ మాత్రమే సెంటిమెంట్‌ను ప్రధానాస్త్రంగా వాడుకుంది. కానీ తాజా పరిస్థితుల్లో అన్ని పార్టీలు సెంటిమెంట్‌ను బలంగా నమ్ముకున్నాయి. కాంగ్రెస్ నాలుగేళ్ళలో సాధించిన అభివృద్దితో జనం ముందుకు వెళుతుండగా, టీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ అభ్యర్థులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనప్పటి నుంచి ఆయా స్థానాల్లో అభివృద్ధి చేయకపోయనప్పటికీ, కేవలం తెలంగాణ సెంటిమెంటే ఆధారంగా ప్రజల వద్దకు వెళుతుండగా, టీడీపీ గత నాలుగేళ్ళుగా ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ, అవినీతి, హత్యారాజకీయాలను ఎండగడుతూ బరిలో నిలబడనుంది.

ఏదైమైనప్పటికీ ఈ ఎన్నికలు టీఆర్ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. గెలిస్తే సెంటిమెంట్ నిలుస్తుంది. లేదంటే దాని ఉనికి ప్రశ్నార్ధకమవుతుంది. ఇక కాంగ్రెస్, టిడీపీలు మాత్రం తమ సొంత విధానాలతోనే బరిలోకి దిగుతున్నాయే తప్పా, సెంటిమెంట్‌ను ఎదురించి కాదు. సెంటిమెంట్ గౌరవిస్తూనే బరిలోకి దిగితున్నందున ఆ రెండు పార్టీలకు వచ్చే నష్టం ఏ మాత్రం లేదు. అన్ని పార్టీలు సెంటిమెంట్‌ను బలపరుస్తున్నందున ఏ పార్టీ గెలిచినా అంతిమంగా సెంటిమెంటే గెలవడం మాత్రం ఖాయం.